# అనుకోని అతిథి

**పి**ల్లి పిల్లల్ని పెట్టిందంటే - 'దగ్గరకు వెళ్ళకండర్రా! గుడ్లు పీకుతుంది-' అని చెప్తే ఎవ్వరూ విన్రు. పిల్లలంతా పిల్లి పిల్లల్ని పెట్టిన చోటే మూగుతారు. అది గుర్రు గుర్రుమన్నా వీళ్ళు విన్రు. కదర్లు. అది ఎల్లాపాలిస్తుందో, ఈ పిల్లముండలన్నీ ఎల్లా తల్లిమీదపడి పాలు కుడుచుకుంటాయో, ఎల్లా అరుస్తాయో అన్నీ వింతలు వింతలుగా చెప్పుగుంటారు. ఆ తల్లి మేతకు వెళ్ళి నపుడో, బయటకు పోయినపుడో దాన్ని యేమార్చి వో పిల్ల కూనను బయటకు తెచ్చి కాస్సేపు దాన్ని పీకిపిండెట్టి ఆడుకుని - మేం పెద్దాళ్ళం గొంతుకలు చించుకుని అరిచాక దాన్ని వాళ్ళు అమ్మ దగ్గర మిగతా కూనలతో వదిలేస్తూ వుంటారు. పిల్లి పిల్లల్ని పెట్టాక ఏడిళ్ళు తిప్పుతుందంటారు. సెక్యూరిటీ కోసం అల్లా చేస్తుందంటారు. గండుపిల్లి చూసిందంటే అది ఏ రాత్రిపూటో వచ్చి పిల్లి పిల్లల్ని పుటుక్కున పీక కొరికి చంపేస్తుందట. తల్లి దగ్గర్లో వుంటే గండుపిల్లి కూడా పిల్లల్ని ఏమీ చెయ్యలేదు. తన పిల్లలకోసం అది అంతలా నిలబడి భీకరంగా పోరాడుతుంది.

పిల్లికి కుక్కలా విశ్వాసం వుండదు. అది యజమాని కళ్ళు పోవాలనుకుంటుంది. దాన్ని పెంచకూడదు. దాన్ది దొంగ స్వభావం. ఏమరుపాటుగా వుంటే మూతల్ని పడదోసి పాలు, నెయ్యి, పెరుగులు జుర్రేస్తుంది. ఈ యింటివాళ్ళు బద్ధకస్తులని అది గ్రహించేసిందంటే ఎలాగో ఓలాగ ఏమార్చి పాలుతాగేసి వెళ్ళిపోవడమో, పాలు వొంపెయ్యడమో చేసి పారిపోతుంది. అది మనింట్లోనే మనకన్నపడకుండా దాక్కుంటుంది. తలుపు ఓరవాకిలిగా వుంటేచాలు లోపల జొరబడి పాలవాసన యిట్టే పట్టేస్తుంది. మాముసలమ్మ గారొకావిడ పిల్లి తోకలను ముట్టుకోవద్దని కోప్పడేది. ఎందుకంటే దాని తోక పట్టుగుంటే దాని పాపాలు మనకి వస్తాయిట. అసలు దాని తోకమీద వున్న రింగులన్నీ అది చేసిన పాపాలేట. అయితే పిల్లిని గట్టిగా కొట్టకూడదంటారు. చీపురు కట్టలోని ఈనెలని అంటే కొబ్బరీనెలని కడిగి విస్తరి దగ్గర పెట్టుకునేవాడు మా తాతయ్య. ఆయన పెరుగు అన్నం జుర్రుతున్నపుడు ఆ బిడాలం వచ్చి తన పాపిష్ఠి కళ్ళతో నాకు పెట్టకుండా తింటున్నావా అని ఎదురుగుండా కూచుని శపిస్తోన్నట్లు 'మ్యావ్ మ్యావ్' మని రొదచేస్తూ వుండేది. అలా అరుస్తూ ఆయన్ని ప్రశాంతంగా తిననివ్వకుండా విస్తరిమీదకు రాబోయినపుడల్లా ఆ కొబ్బరి ఈ నెలతో ఠాప్ ఠాప్‌మని చురక్కుమని పిస్తూ వుండేవాడు. దానిమీదకు పిల్లలు 'రాయో, కట్టెపేడో' విసిరితే అది ఛెంగున దూకి చలాగ్గా తప్పించుకునేది ముండ. అది ఛస్తే 'పిల్లిని చంపిన పాపం గుడి కట్టించినా పోదర్రా' అనేవాడు మాతాతయ్య. వెనకటికి ఓ షావుకారు తూకపు రాయి పిల్లిమీదకు విసరగా అది ధామ్మని చచ్చింది. ఆ షావుకారుగారి పెళ్ళాం 'ఏం పనిచేశావయ్యా' అని మొగుడ్ని తిట్టి బ్రాహ్మడికి కబురెట్టి ఈ పాపానికి ప్రాయశ్చిత్తం చెప్పమని అందిట. అప్పుడా పంతులుగారు దాని యెత్తు సువర్ణ మార్జాలాన్ని చేయించి ఓ

సద్బ్రాహ్మడికి దానం చేస్తే ఆ పాపం పోతుందని చెప్పొద్ద. ఆ షావుకారు ఆ పిల్లిని చేయించాడో లేదో మనకైతే తెలీదుకాని బ్రాహ్మడుగారి అయిడియా మాత్రం బెమ్మాండంగా వుంది. పాపభీతి అనేది లేకపోవడంవల్లే లోకంలో పాపాలెక్కువ జరుగుతున్నాయి. పాపం లేదు, పుణ్యం లేదు అంతా నాన్సెన్స్ దేవుడు లేడు అంటారనుకోండి. జనానికి ఏదో ఒక భయమో భక్తో ఏడిచి చావాలిగదా పాపాలు చెయ్యకుండా, చచ్చిపోయిన పిల్లి తూగినంత బంగారం యివ్వాలిసొస్తుందంటే పిల్లినెప్పుడూ చంపడు. ప్రతివాడూ పిల్లిమీద అలిగి ఆగ్రహించి పిల్లి జాతిని నిర్మూలించేశాడనుకోండి పిల్లి రహిత ప్రజాస్వామ్యం ఏర్పడి, ఎలుకలన్నీ విప్లవ వీరుల్లా విజృంభిస్తాయి. పిల్లి ఇంట్లో తిరుగుతూంటే ఎలుకలు దరికిరావు. అసలైన పిల్లుల పోట్లాట ఎంత హడావిడిగా వుంటుందంటె యిద్దరు పల్లెటూరి ఆడాళ్ళు ఓ మగాడికోసం పోట్లాడుకున్నట్లు వుంటుంది. పిల్లి వున్న చోటుకి పాము రాలేదు. పిల్లి కొండొకచో తాచుపాముని కూడా నిలబెట్టెయ్యగలదుట. అయితే అది చలికి తట్టుకోలేదు. పిల్లి చీకట్లో కూడా చూస్తుందంటారు. ఇంగ్లండు రాణీగారి కుర్చీకింద ఎలకపిల్లని యింగ్లీషుపిల్లి ఓటి బెదిరించిందిట. ఇంగ్లీషు వాళ్ళు ఆడపిల్లల్ని 'కేట్స్' అని వేళాకోళంగా రిఫర్ చేస్తూ వుంటారు. మనకి మార్జాలకిశోరన్యాయం వుంది. భగవంతుడే మనిషి ముండావాడ్ని పిల్లి పిల్లను నోటితో కరిచి పట్టుకుని తీసికెళ్ళి నట్లు తీసికెళ్ళి మోక్షం యిప్పించాల్ట. ఇలాక్కాపోతే భక్తుడుగారే భగవంతుడ్ని చేతుల్తో గట్టిగా జారిపోకుండా పట్టుగోవాలిట. అంటే కోతిపిల్ల కోతిని పట్టుకున్నట్లు అన్నమాట. దీన్నే మర్కట కిశోర న్యాయం అంటారు పెద్దలు.

అసలీ పిల్లి గొడవేవిటి శుభవా అని పత్రిక తెరిస్తే అని విసుక్కుంటున్నారా? చిత్తం! చిత్తం! అన్నంకంటె ఆవకాయ ఎక్కువయినట్లు ఒకప్పుడు కథ కంటె గిద ఎక్కువవుతూ వుంటుంది. డాక్టర్లు కూడా 'వెర్రివాళ్ళ లారా కంచెడు కంచెడు అన్నాలు లాగించకండ్రా దానికి బదులు కూరలు బాగా తినండి, అన్నం కొంచెం ఆధరువు మిక్కుటంగా లాగిస్తే సంపూర్ణ యవ్వనవంతులూ, ఆరోగ్య వంతులూ అవుతారని నూరిపోస్తున్నారు. మా మామయ్యగారి ఫ్రండొకాయన వీర్రాజుగా రని వుండేవారు. ఆయన తోమిన రాగిచెంబులా ధగధగ మెరిసిపోయేవారు. రోజుకి ఒక్కపూటే భోంచేసేవారు. రెండోపూట గాంధిగార్లా పచ్చి వేరుసెనగ ఒక శేరు, పచ్చి గేదపాలు అర్ధశేరు పుచ్చుగుని గాంధీగారిని అహింసను తిడుతూ వుపన్యాసాలిచ్చేవారు. ఆయన అంగోస్త్రాన్ని ఎలకలు కొట్టేసినపుడు మమ్మల్ని వో పిల్లిని పెంచమని ఆయన సలహా యిచ్చారు. ఒక్క చిన్న పలుకు కూడా మాకు పెట్టకుండా అంతా ఆయనే భోంచేసేవారు. ఎవరేనా మడి తడి ఆచారం అన్నీవున్న వాళ్ళు బోయినానికి పిలిస్తే మధ్యాహ్నం భోంచేసేవాడు. అలాటి నిష్ఠ నియమవూ వున్న మనిషిని పెట్టుగుంటే పిల్లా జల్లావున్న కొంపల్లో ఆడాళ్ళకు మరీ మరీ కష్టం అయిపోయేది. ఆయన కంటె ముందు ఎవరూ భోంచెయ్యకూడదు. ఆయన ఎంత లేటుగా వచ్చినా యింటిల్లిపాదీ కనిపెట్టు క్కూర్చోవాలి. ఎవరేనా ముందు తింటే ఆయన విస్తరి దగ్గర్నుంచి లేచిపోయేవాడు. ఆయన

మెళ్ళో ఓ చిన్న లింగం వుండేది. దానికి ముందుగా పూజా పునస్కారమూ చేశాక ఆయన విస్తరిముందు కూచుని పరిషేచన చేసేవాడు. గాంధీగారి చితాభస్మాన్ని అన్ని నదులలోనూ కలిపించినపుడు – 'ఆయన ఎన్ని పాపాలు చేసాడేవిటి, అన్ని నదుల్లో కలుపుతున్నారు బూడిద' అని వెక్కిరించాడు. 'హిందువులకు సమాధులేవిటి? ఈ నెహ్రూకి పిచ్చెక్కింది. గాంధీగారి సమాధి అనేది తప్పు. పాతిపెడితే సమాధి వుంటుందిగాని, కాలిస్తే బూడిదయాక అది సమాధి ఎలా అవుతుంది వెర్రిముండాకొడకల్లారా' అని తిట్టేవాడు.

మొన్నీమధ్య మావారికో పిల్లి దారిలో వస్తూంటే కాలికి అడ్డం పడి చుట్టుకుని 'మ్యావ్ మ్యావ్' మని అరుస్తూ వదల్లేదు. అప్పుడాయన తనో గౌతమ బుద్ధుడనుకున్నారో ఏమో ఆ పిల్లిని ఎత్తుకొచ్చి యింట్లో వదిలారు. దానికి వెనక రెండు కాళ్ళూ చచ్చుబడి పోయాయి. తోక కదల్దు. కాని అది మహా చురుకు. మన్ని నిలబెట్టి అరిచేస్తుంది తన మాట వినమని. అలా చచ్చుబడిపోయిన కాళ్ళతో మనం కూచుంటే మన పంచెగాని, లాగుగాని పట్టుకుని మీదకి ఒళ్ళోకి పాకేస్తుంది. ఎన్నిమాట్లు దింపినా మళ్ళీ చకచక మీదకు పాకేస్తుంది. పాలుపోస్తే గబగబ తాగేస్తుంది. ఎంత చురుకో అంత చురుకు. అది అరిచినంతసేపూ మనం 'వూ' కొట్టాలి. ఆ కళ్ళు ఎంత మెరిసేవో – దాన్ని పశువులాస్పత్రికి తీసికెళ్ళి ఇంజక్షన్లు యిప్పించి కాళ్ళకి రాయడానికి టర్పంటేన్ ఆయిలూ తెచ్చి మర్దనా చేశారు. అది అనుకోని అతిథిలా వచ్చి మా యింట్లో మూడురోజులుంది. అంత చిన్న ప్రాణి మనిషి స్నేహంకోరి వచ్చి రెండ్రోజులు వుండి వెళ్ళిపోతే ప్రాణం చివుక్కుమంది.

మనవైనా అంతేగా! ఈ లోకానికి అతిథులుగా వచ్చి రెండ్రోజులుండి వెళ్ళిపోతాం. –

వాసాంసి జీర్ణాని
యథా విహాయ
నవాని గృహ్ణాని నరోపరాణి...

---

# సరస్వతీ వస్త్రాపహరణం

నెమిలికి పింఛంలా పత్రికకి అడ్వర్టయిజుమెంట్లు చక్కనిడిజైన్లు బొమ్మలతో వుంటే నయనానంద కరంగా వుంటుంది. నా మట్టుకి నేను పత్రిక రాంగానే అది డైలీ అయినా వీక్లీ అయినా యింకేదైనా ముందు అడ్వర్టయిజుమెంట్లు చూస్తాను సరదాకి. కథలూ నవల్లూ కార్టూన్లు రాసేవాళ్ళు ఎంత చురుగ్గా తమ తెలివి అంతా వుపయోగిస్తారో, అల్లాగే ప్రకటనలు చేసేవాళ్ళు కూడా. ప్రకటనలతో పాటు ఆయా కంపెనీల వాళ్ళు చిన్న స్లోగన్లను కూడా యిస్తూ వుంటారు. మచ్చుకి రేమండ్స్ వాళ్ళు వధూవరుల బొమ్మవేసి 'మీ మనసులో వున్నది